క్లుప్తంగా

వినికిడి యంత్రాల బహూకరణ



ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ పంటపాళెంలో పేదలకు వినికిడి యంత్రాలను మంగళవారం బహూకరించింది. ఇటీవల జరిగిన వైద్య శిబిరంలో 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించిన 22 మందికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా వినికిడి యంత్రాలను అందజేశారు. స్థానిక సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ వైద్యులు రాధాకృష్ణ ఇతర సిబ్బంది కలిసి రోగులకు వీటిని అమర్చారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



విడవలూరు : మండలంలోని ముదివర్తి, ఊటుకూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



లక్ష తులసీ దళార్చనలో మహిళలు

మనుబోలు : స్థానిక విష్ణాలయంలో భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. అర్చకుడు హనుమాచార్యులు వేకువజామునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవునికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక లక్ష తులసీ దళార్చన పూజను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా ఆమంచర్ల సుధాకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం : 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.మహేంధర్‌రెడ్డి సూచించారు. వెంకటాచలంలో నెహ్రూ యువకేంద్రం, ప్రజాసత్తా సంయుక్త ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వాతి బీఈడీ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సదస్సులో మహేంధర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసత్తా అధ్యక్షుడు పి.శోభన్‌బాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

మనుబోలు : వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి సూచించారు. మనుబోలు మండల కేంద్రంలోని బాలికల, బాలుర వసతి గృహాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అంటూ విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. హెచ్‌డబ్ల్యూఓలు మహేశ్వరి, సుధాకర్ ఉన్నారు.

తప్పుడు రాతలు సబబు కాదు

విడవలూరు : మండలంలోని అన్నారెడ్డిపాళేనికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారు వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చి చేరినట్లు వారు ప్రకటించుకోవడం సబబు కాదని విడవలూరు మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. టీడీపీలో చేరిన అన్నారెడ్డిపాళెం గ్రామస్తులు సీపీఎం పార్టీకి చెందిన వారని, వైఎస్సార్‌సీపీలో వారికి ఎలాంటి సభ్యత్వం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు పచ్చపత్రికల్లో రాయించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



ఈమె పేరు **పసుపులేటి అంకమ్మ**, కొడవలూరు మండలం కొత్తవంగల్లు గ్రామానికి చెందిన ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. వీరికి అర ఎకరా పొలం మాత్రమే ఉండడంతో దానిమీద వచ్చే లాభంతో కుటుంబం గడవడం కష్టమైంది. దీంతో ఆమె భర్తతో కలిసి కూలి పనులకు వెళ్తోంది. కుమార్తెను చదివించే స్తోమత లేక చదువు మాన్పించేశారు. కుమారుడిని చదివిస్తుండగా అనుకోని ప్రమాదం వల్ల రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించినప్పటికీ వైకల్యం తప్పలేదు. ఈ పరిస్థితుల్లో కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదే సమయంలో రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యారు. దివ్యాంగుడైన కుమారుడికి పింఛన్ మంజూరైంది. చదవాలన్న తపనతో అతను డిగ్రీలో చేరగా విద్యాదీవెన మంజూరైంది. అర ఎకరా పొలం మాత్రమే ఉన్నా రైతు భరోసా నగదు ఇస్తున్నారు. ఆమె భర్త కూలి పనులు లేని సమయంలో ఆటో నడుపుతుండగా వాహనమిత్ర మంజూరైంది. ఇవన్నీ వలంటీర్ల సాయంతో గ్రామ సచివాలయ సిబ్బంది చొరవతో మంజూరు కావడంతో కష్టాల నుంచి బయటపడ్డారు. కుమార్తెకు వివాహం చేశారు. వికలాంగుడైన కుమారుడి గురించి చింతించాల్సిన బాధ తప్పిందని, మా కుటుంబాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా ఆదుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు.



ఈ ఫొటోలోని మహిళ పేరు **మార్తూరు లక్ష్మి**, నార్తురాజుపాళేనికి చెందిన రజక వృత్తిదారు. ఈమె భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఒక కుమారుడు ఉండగా, చదివించే స్తోమత లేక మాన్పించేశారు. రజక వృత్తి ద్వారా కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా మారడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్ సీఎం అయ్యారు. ఆమెకు వితంతు పింఛన్ మంజూరు కావడంతో పాటు చేదోడు పథకం మంజూరు చేశారు. దీని ద్వారా ఏడాదికి రూ.10 వేలు ఉచితంగా ఇస్తుండడంతో సొంతంగా ఇస్త్రీ పెట్టె, బండి తదితరాలను కొనుగోలు చేసి ఇంటి వద్దే లాండ్రీ దుకాణం పెట్టుకున్నారు. దీంతో రోజువారీ రాబడి మెరుగుపడింది. అప్పుల చేయాల్సిన పరిస్థితి నుంచి గట్టెక్కి కుటుంబాన్ని సజావుగా నడుపుకోగలుగుతున్నారు. ఈ పథకం కోసం ఈమె ఎవరి చుట్టూ తిరగలేదు. వలంటీరు ద్వారా గ్రామంలోని సచివాలయంలో పథకానికి దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరు చేశారు. మా కుటుంబం అప్పుల బాధ నుంచి బయట పడి సంతోషంగా జీవిస్తున్నామని, అందుకు జగనన్న అందించిన చేదోడు కారణమని, ఆయనకు రుణపడి ఉంటామని స్పష్టం చేశారు.

సచివాలయాలు.. పేదల నేస్తాలు

- గ్రామస్థాయిలో పారదర్శక పాలన
- ఫలితంగా అట్టడుగు వర్గాలకు చేరువైన పథకాలు



నార్తురాజుపాళెం-1 సచివాలయం

కొడవలూరు: సచివాలయ వ్యవస్థ గ్రామాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి పరుగులు తీసి కాళ్లరిగేలా తిరిగే వ్యయప్రయాసలకు స్వస్తి పలికించింది. అర్హులు ఏ మారుమూల ఉన్నా వెతికి ఇంటి ముంగిటకే పథకాలను చేరువ చేసింది. ఎలాంటి సమస్యనైనా గ్రామంలోనే పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది. పథకాల కోసం నేతల చుట్టూ తిరిగే సాంప్రదాయానికి చెల్లుచీటి పలికింది. సంక్షేమం ఇంటికే అందించడంతో పాటు ఏ సర్టిఫికెట్‌నైనా గ్రామంలోనే పొందే అవకాశం కల్పించింది. వ్యయప్రయాసలు భరించలేక పథకాలు మాకొద్దులే బాబు అనే వారు లేకుండా చేసిన ఘనత సచివాలయ వ్యవస్థకే దక్కింది.

వివిధ పథకాల ద్వారా

సచివాలయాలు ఏర్పాటయ్యాక ప్రజలకు జరుగుతున్న మేలు చూస్తే నివ్వెర పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.కోట్లలో సంక్షేమం అందడంతో పాటు అన్ని సమస్యలను గ్రామంలోనే సులువుగా పరిష్కరించుకుంటున్నారు. నార్తురాజుపాళెం–1 సచివాలయ పరిధిలో ఆసరా, అమ్మఒడి, చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, వాహన మిత్ర, కాపునేస్తం తదితర 21 రకాల సంక్షేమ పథకాలు 2,600 మందికి అందుతోంది. నగదు రూపంలో వీరికి రూ.7 కోట్ల 31 లక్షల 71 వేల 898 నగదు నేరుగా అందింది. అంతేకాకుండా నివేశన స్థలాలు, ఇళ్ల మంజూరు ద్వారా 95 మందికి రూ.2.14 కోట్ల లబ్ధి జరిగింది. ఇలా మొత్తం మీద ఈ ఒక్క సచివాలయ పరిధిలోనే ప్రభుత్వం ద్వారా 3,503 మందికి రూ.9 కోట్ల 53 లక్షల 79 వేల 898లు లబ్ధిపొంది ఉన్నారు.



ఈయన పేరు **నాదెండ్ల నాగేశ్వరరావు**, కొడవలూరు మండలం కొత్తవంగల్లు గ్రామానికి చెందిన ఈయనకు మూడు ఎకరాల పొలం ఉంది. భార్య, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఆ పొలాన్ని సాగు చేయడం ద్వారా కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. కుమార్తెను చదివించుకోవడం కూడా పెనుభారంగా పరిణమించింది. ప్రతి ఏడాది ఎంతో కొంత అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కుమార్తెకు అమ్మఒడి మంజూరైంది. నాగేశ్వరరావుకు కాపు నేస్తం, రైతు భరోసా మంజూరు చేశారు. ఈ పథకాలు వారి కుటుంబానికి ఆసరాగా మారాయి. కుమార్తె చదువుకు రూపాయి ఖర్చు చేయాల్సిన పరిస్థితి లేకుండా పోయింది. వ్యవసాయంలో ఒడిదొడుకులున్నప్పటికీ రైతు భరోసా అండగా నిలిచింది. దీంతో వారి కుటుంబానికి కష్టాల నుంచి ఉపశమనం లభించింది. అప్పులు చేయాల్సిన బాధ తప్పడంతో పాటు కుటుంబాన్ని సాఫీగా సంతోషంగా నెట్టుకొస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థల ద్వారానే తమ కుటుంబం కష్టాల నుంచి బయటపడిందని ఆయన సంతోషం వెలిబుచ్చారు.

గ్రామ సచివాలయం	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి
నార్తురాజుపాళెం-1	3,503	రూ.9,53,79,898

గ్రామస్థాయిలోనే పాలన



సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామస్థాయిలోనే పరిపాలన జరుగుతోంది. ప్రభుత్వానికి సంబంధించిన ఏ పనికైనా మండల కేంద్రానికి తిరగకుండా గ్రామంలోని పరిష్కరించుకునే వెసులుబాటు సమకూరింది. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఈ వ్యవస్థ అమలు ఎంతో ఆదర్శంగా జరుగుతోంది. దీనివల్ల పేదల జీవనం ఎంతో మెరుగుపడింది.

– వి.ప్రద్యుమ్నకుమార్, ఎంపీడీఓ, కొడవలూరు

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఇందుకూరుపేట : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. మండలంలోని లేబూరు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు ప్రతి కుటుంటానికి చేరాలన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ వైద్యశాలల్లో అందిస్తున్న సేవలు, సర్జరీల గురించి ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశాలు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రోగులతో, స్థానిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. వైద్యులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్, హెచ్‌ఈఓ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, సర్పంచ్ వరిగొండ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు స్థానిక శ్రామికనగర్‌లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కోసం కళాజాత ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు తదితర అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. క్షయ వ్యాధి లక్షణాలు, సంక్రమిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎస్.భాస్కర్, రామకృష్ణయ్య, లింక్‌వర్కర్ జి.శ్రీనివాసులు, ఆశావర్కర్ భారతి పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి

- వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి

వెంకటాచలం: ప్రాథమిక దశలోనే విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మాతృభాష ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. మాతృభాష మనుగడ కోసం ఆయా సంస్థలు, విశ్వవిద్యాలయాలు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, వీఎస్‌యూ పూర్వపు రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ తదితరులు మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది, కార్యనిర్వాహక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



మందులను పరిశీలిస్తున్న సర్పంచ్ జనార్ధనరెడ్డి

ముత్తుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారిందని మునునూరువారిపాళెం సర్పంచ్ మునుకూరు జనార్ధనరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం తలపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేసిన మందుల నాణ్యతను, వైద్యులు అందించే సేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పేదలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ షాహుల్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డు పల్లెపాళెంలో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను ఆ వార్డు కౌన్సిలర్ షేక్ షాహుల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపాళెంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని అడిగిన వెంటనే ఎంపీ లాడ్స్ నుంచి రూ.5 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వెంటనే పనులను మొదలు పెట్టామని వివరించారు. అడిగిన వెంటనే నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే ప్రసన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు

వెంకటాచలం: వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్–2 ఆధ్వర్యంలో మండలంలోని కంటేపల్లిలో మంగళవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, కలర్స్ ఐడెంటిఫికేషన్, క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే గ్రామంలోని రచ్చబండ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో డ్రాప్‌అవుట్ స్టూడెంట్స్‌ను గుర్తించి చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్–2 ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామంలో 40 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. నెల్లూరు నగరంలోని మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి కాకాణి చేస్తున్న కృషితో తామంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

సీఎం జగన్ వెంటే రాష్ట్ర ప్రజలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైపే రాష్ట్ర ప్రజలు ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ 2019–24 మధ్య గురివిందపూడి గ్రామంలోనే రూ.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, కమ్యూనిటీ హాల్ భవనాలు, పాఠశాలకు అదనపు గదులు, సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు నిర్మించడంతో పాటు ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి సరఫరా పనులు చేపట్టామన్నారు. ఒక్క మనుబోలు మండలంలోనే అసైన్‌మెంట్ పట్టాల రూపంలో 1,006 కుటుంబాలకు 1,224 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించామని తెలిపారు. 862 ఎకరాల చుక్కల భూముల సమస్యకు విముక్తి కల్పించామన్నారు.

సోమిరెడ్డికి ఓటు అడిగే హక్కు లేదు

కష్టకాలంలో ప్రజలను గాలికొదిలేసి పారిపోయే సోమిరెడ్డికి ఇప్పుడు ఓటు అడిగే హక్కు లేదని కాకాణి ధ్వజమెత్తారు. కరోనా సమయంలో అప్పలను కోల్పోయి, పూట గడవడం కష్టమై ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాను అండగా ఉంటూ వారి బాగోగులు చూశానన్నారు. ఆయన సీటుకే షూరిటీ లేని సోమిరెడ్డి, ప్రస్తుతం 'బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ' అంటూ కరపత్రాలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నాడన్నారు. అంతకు ముందు కాకాణికి సర్పంచ్ మన్నెమాల సుమతమ్మ, సుధీర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీఓ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు కార్తీక్‌రెడ్డి, రవికుమార్, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు చేవూరు ఓసూరయ్య, హరగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, వెంకటసుబ్బయ్య, రవీంధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేంద్రవర్మ, రమేష్, దయాకర్, గిరి పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లికి మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని నేదురుమల్లి గ్రామానికి వస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ మంగళవారం తెలిపారు. గ్రామంలో పూర్తి చేసిన సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ముందుగా పొదలకూరు–సంగం మెయిన్‌రోడ్డు వద్ద నావూరు తారురోడ్డు ఆధునికీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన గావిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి 23 వరకు గడువు

తోటపల్లిగూడూరు : ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి సంబంధించి ఈనెల 23వ తేదీ చివరి గడువని కోడూరు గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలకు సంబంధించి కోడూరు గురుకుల కళాశాల కేంద్రంలో మార్చి 10వ తేదీన ఐదో తరగతికి ఉదయం 10 నుంచి 12 వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 7,805 మంది విద్యార్థులకు గానూ 7,292 మంది హాజరు కాగా 513 మంది గైర్హాజరయ్యారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థి డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పొదలకూరు : పట్టణంలోని శ్రామికనగర్‌లో ఉన్న గిరిజన కాలనీలో మంగళవారం భక్తులు పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మేళతాళాలు, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ప్రతి ఏటా ఇక్కడి గిరిజనులు పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించి పట్టణానికి చెందిన ప్రముఖులను ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ సోమా అరుణ, వూకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల ప్రసాద్, సోమా రామకృష్ణయ్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇందుకూరుపేట : పుష్పాలంకరణలో అమ్మవారు

గంగపట్నంలో..

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన పోలేరమ్మకు పొంగళ్లు, సద్ది సమర్పణ కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

వైభవంగా రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం మంగళవారం వైభవంగా నిర్వహించారు. చందనాలంకారంలో ఉన్న అమ్మవారికి దంపతులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శివాలయం ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి పర్యవేక్షణలో రుద్రాభిషేకం గావించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో దంపతులు